క్లుప్తంగా

పన్నుల రూపంలోనే ఆదాయం



మాట్లాడుతున్న చైర్మన్ సూతకాని జైపాల్

వైరా: మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం మంజూరు చేసే గ్రాంట్లతో పాటుగా ప్రజల నుంచి నేరుగా పన్నుల రూపంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. బుధవారం 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం రూ 7.05 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్‌ను ఆమోదించారు. వ్యయం రూ.6,97,00,000 మిగులు రూ.7,48,000 అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కమీషనర్ చింతల వేణు, ఆయా వార్డు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

చింతకాని: మండల పరిధిలోని చినమండవ గ్రామంలోని పల్లె దవాఖానాను ఎంపీపీ కోపూరి పూర్ణయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. పల్లె దవాఖానాలోని పలు రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ అనీల్ కుమార్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్లలో గృహజ్యోతి పథకం ప్రారంభం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో బుధవారం గృహజ్యోతి పథకం కింద కరెంట్ బిల్లులు (జీరో బిల్లుల) పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ గోసు మధు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుండ్ల కోటేశ్వరరావు, పెద్దగోపతి సబ్ స్టేషన్ ఏఈ రాయల సురేష్, పంచాయతీ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన రైతు వెల్లటూరు భ్రమరాంబ ఇటీవల మృతి చెందారు. ఆమె పేరిట సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్స్ చేశారు. ఈమె మృతితో మంజూరైన బీమా నగదు రూ.50వేలను ఆమె భర్త సత్యనారాయణకు బుధవారం మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్‌లో మేనేజర్ మగినం వీరభద్రం, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సూపర్‌వైజర్ మహేష్, సీఈఓ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ఏటీడీఓ తనిఖీ

కారేపల్లి: మండలంలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలను ఏటీడీఓ జహీరుద్దీన్ సందర్శించి బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కొమ్మలను డిప్యూటీ వార్డెన్ వీరూనాయక్ నరికించి, గ్యాస్‌కు బదులుగా వంటచెరుకుగా వినియోగించాడని తెలిసింది. దీంతో వారు విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వీరూనాయక్‌ను వార్డెన్ బాధ్యతల నుంచి తొలగించారు. విచారణ నివేదికలను ఐటీడీఓ ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు.

ఒకేసారి మూడు కొలువులు

సత్తుపల్లిరూరల్: ప్రతి విద్యార్థి తాను చదువుకున్న పాఠశాలకు ముఖ్యఅతిధిగా హాజరయ్యే స్థాయికి ఎదగాలని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన కాట్రాల మధు విశ్వశాంతి విద్యాలయంలో 10వ తరగతి వరకు చదివారు. ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలకు హాజరై ఒకేసారి ఓపెన్ క్యాటగిరిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. కానిస్టేబుల్, గ్రూప్–4, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా నియామకం పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం విశ్వశాంతి విద్యాలయంలో ఉపాధ్యాయులు శాలువా, జ్ఞాపికలతో మధును ఘనంగా సత్కరించారు.

నియామకం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి జగదీష్‌కుమార్, రామిశెట్టి శ్రీనివాసరావులు నిలాద్రీశ్వరాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ద్వారా రూ.1,00,116లను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేతుల మీదుగా బోర్డు చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావుకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులతో పాటుగా గంగిశెట్టి జగదీష్‌కుమార్‌ను అభినందించారు. మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, శ్రీధర్, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేడుకలకు సర్వం సిద్ధం

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శివాలయాలు

- ఈ నెల 8న శివపార్వతుల కల్యాణం
- మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు

మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్నటువంటి శివాలయాలు ముస్తాబయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 8వ తేదీ తెల్లవారుజాము నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు.

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో ఉన్నటువంటి పురాతన దేవాలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే



నేరడ గ్రామంలోని శివాలయం

నేరడ గ్రామంలోని భ్రమరాంబ సమేత శ్రీ రామలింగేశ్వరరస్వామి, పందిళ్లపల్లి గ్రామంలోని శ్రీ గంగా గౌరీ సమేత రామలింగేశ్వరస్వామి, కొదుమూరులోని రామలింగేశ్వరస్వామి, పాతర్లపాడు, నాగులవంచ గ్రామాల్లోని శివాలయాలను కూడా ప్రత్యేకంగా అలంకరించారు.

అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు..

మూడు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఆలయాల వద్ద షామియానాలు ఏర్పాటు చేసి మంచినీటి, వైద్య సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి ఆలయాల్లో నిర్వహించే శివపార్వతుల కల్యాణంలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.



వందనం గ్రామంలో ముస్తాబైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం

బందోబస్తు ఏర్పాటు చేశాం..



ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ఈ ఉత్సవాలల్లో మద్యం అమ్మకాలతో పాటు డీజే సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– షేక్ నాగుల్‌మీరా, ఎస్సై చింతకాని

మన్నించు మల్లికార్జునస్వామి

- 54ఎకరాలున్నా.. సౌకర్యాలు నిల్
- ఈ ఏడాది కూడా మహాశివరాత్రికి భక్తులకు తప్పని నీటి ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ముదిగొండ: మండలంలోని వల్లాపురం మున్నేరు సమీపాన పురాతన మల్లికార్జునస్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయం పేరిట మొదటి నుంచి 54ఎకరాలు భూమి ఉండగా.. పరిసరప్రాంత రైతులకు కౌలుకు ఇచ్చారు. దీంతో రైతుల నుంచి కౌలు రూపంలో దేవాదాయశాఖకు కొంత ఆదాయం వస్తుంది. దీంతో పాటుగా ప్రతీ ఏటా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులనుంచి వచ్చే ఆదాయం, హుండీ ఆదాయం, దుకాణాల నుంచి వచ్చే ఆదాయం, దర్శన టికెట్లకు వచ్చే ఆదాయం, కొబ్బరికాయల వేలం పాటకు వచ్చే ఆదాయం, భక్తుల విరాళాలు కలిపి రూ.లక్షల్లో ఉన్నా.. ఇక్కడ మాత్రం భక్తులకు సౌకర్యాలు శూన్యం.

అసౌకర్యాల నడుమ భక్తుల పూజలు..

జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయ శాఖ అధికారులు గుడికి రంగులు వేసి నాలుగు లైట్లు పెట్టి మెరిపిస్తుంటారు. కానీ సుదూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు కనీస సౌకర్యాలు లేక ఒక్కరోజేగా ఏముందిలే అంటే సర్దుకుపొంతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు..

మున్నేరులో చుక్కనీరు లేక, సమీప ప్రాంతంలో బోర్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురౌతారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారు



వల్లాపురంలోని మల్లికార్జునస్వామి దేవాలయం



చుక్కనీరు లేని మున్నేరు

లకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు చూపించే వాటిపై లేని శ్రద్ధ, వేలం పాటలపై మక్కువ ఎక్కువని వాపోతున్నారు. తక్షణమే మంచినీటి బోర్లు వేయించి నీటి సౌకర్యం కల్పించి, దేవాలయంపై వచ్చే ఆదాయ మార్గాలు బహిర్గతం చేయాలని, రహదారుల్లో దుమ్ములేవకుండా నీరు చల్లించాలని, నీడ కోసం టెంట్లు వేయించి, మంచి నీటి ట్యాంకర్లు ఏర్పాట్లు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

నీటి కుళాయిలు ఏర్పాటు చేయించాలి..



బోర్లు ఏర్పాటు చేసి, నీటి కుళాయిలు అమర్చాలి. మున్నేరులో చుక్క నీరు లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ట్యాంకర్లు పెట్టించినా వేలల్లో వచ్చే భక్తులకు నీళ్లు సరిపోవు, గత ఏడాది బోర్ వేయించాం. కానీ వాటికి వరలతో నీటి తొట్లు నిర్మించి, పత్యామ్నాయ సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. లేదంటే ఈ ఏడాదికూడా ఇబ్బందులే.

– అమదాల జక్కార్, మాజీ సర్పంచ్, వల్లాపురం

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..



కలెక్టర్‌తో సమావేశాలు జరిపారు. ఎక్కడెక్కడ నీటి సౌకర్యం లేదో చెప్పమన్నారు. సమస్య ఉన్న చోట చెప్పాం. మున్నేరులో కూడా చుక్క నీరు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. గత ఏడాది వేయించిన బోరు నుంచి అక్కడక్కడ నీటి గుంతలు తీయించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– నారాయణచార్యులు, దేవాదాయశాఖ ఈఓ, ముదిగొండ


ముమ్మరంగా జాతర ఏర్పాట్లు



లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో మహాశివరాత్రి వేడుకలకు పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. ఐదురోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలం, ఆర్టీసీ బస్సులు, ఆలయ ప్రాంగణంలో దుకణాలు, చలువ పందిళ్లు, దైవదర్శనానికి బారి కేట్లు తదితర సౌకర్యాలు నిర్వహించారు. వైరా నదిలో పుణ్యస్నానాలు చేసేందుకు అధికారులు నీటిని విడుదల చేయాల్సి ఉంది. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో ఈ నెల 8 నుండి 10వ తేదీవరకు నిర్వహించనున్న మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం (శివాలయం) ముస్తాబైంది. ఈ వేడుకలకు ఆలయ ప్రాంగణంలోని కోనేరును శుభ్రపరచి నీటిని నింపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలతో పాటుగా ట్రాక్టర్ రివర్స్, నాటు గొర్రె పొట్లేళ్ల, స్లోసైకిల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, ఆలయ అర్చకులు నర్సింహమూర్తి తెలిపారు.



బనిగండ్లపాడులో ముస్తాబైన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం



భవన్నపాలెం అటవీప్రాంతంలోని నీలాద్రీశ్వరాలయం

పెనుబల్లి: మండలంలోని భవన్నపాలెం అటవీప్రాంతంలోని నీలాద్రీశ్వరాలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. ఆలయాన్ని రంగులతో అలంకరించి క్యూ లైన్లు కోసం భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. రెండు లక్షల మంది భక్తులు నీలాద్రీశ్వరుని దర్శనం కలిగేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది ఆలయ ఆవరణలో 14 అడుగల ఎత్తుతో 2,25,000ల నేపాల్ రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన మహా శివలింగం ప్రత్యేకతను సంతరించుకుంది. తిరుపతికి చెందిన ఆధ్యాత్మక గురువు బోధను విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మహారుద్రాక్ష శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ఈ మహా లింగానికి పూజల అనంతరం భక్తులకు ఉచితంగా రుద్రాక్షలు, రక్షణ యంత్రాలు తదితర పూజా సామగ్రి ఉచితంగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.వంద కోట్లతో అభివృద్ధి చేస్తాం

తల్లాడ/పెనుబల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో వందకోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం తల్లాడ మండలంలోని పినపాక, మంగాపురం, తల్లాడ, నారాయణపురం, అన్నారుగూడెం, రామచంద్రాపురం గ్రామాలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అదే విధంగా పెనుబల్లి మండలంలోని రామచంద్రాపురంలో రూ. 21 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల సహకారంతో తాను సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నారాయణపురంలో తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్, కిరణ్, రామలక్ష్మణ్, వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, రామారావు, జనార్దన్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, వీరనరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, గురుస్వామి, ఎస్సై కొండల్ రావు, ఎంపీఓ శ్రీదేవి, ఏఈ అశోక్, కృష్ణ,



తల్లాడ: సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

బ్రహ్మారెడ్డి, హరీష్‌రెడ్డి, విజయారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

చింతకాని: మండలంలోని చినమండవ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ కోపూరి పూర్ణయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.9 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గోవిందరావు, కాంగ్రెస్, సీపీఐ నాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే ‘రైతు నేస్తం’

కొణిజర్ల/ బోనకల్/ కల్లూరురూరల్: రైతుల సంక్షేమం, రైతులకు ఆధునిక శాస్త్ర సాంకేతిక సలహాలు సూచనలు అందించడానికే ప్రభుత్వం రైతు నేస్తం పథకం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, వైరా, మధిర ఏడీఏలు సతీష్, కొంగర వెంకటేశ్వరావు, మండల ప్రత్యేకాధికారి వెంగమాంబ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సచివాలయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ బుధవారం ప్రారంభించారు. తనికెళ్ల, కల్లూరులోని కోరట్లగూడెం, బోనకల్ రైతు వేదిక భవనాల్లో రైతు నేస్తం టెలీ కాన్ఫరెన్స్‌ను వారు సత్తుపల్లి, మధిర, వైరా సబ్ డివిజన్ పరిధిలోని ఏఓలు, ఏఈఓలు, రైతులు, ప్రజా ప్రతినిధులతో కలిసి తిలకించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో టెలీ కాన్ఫరెన్స్ ఉంటుందని



కొణిజర్ల: వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రైతులకు సూచనలు సలహాలు అందించడానికి శాస్త్రవేత్తలు, సీనియర్ రైతులు, ఆదర్శ రైతులు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ నర్సింహారావు, కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఎంపీపీ గోసు మధు, వ్యవసాయాధికారులు సరిత, శ్రీనివాసరావు, కొండూరు విజయ్‌బాస్కర్, నాగయ్య పాల్గొన్నారు.

జాతరలో పటిష్ట బందోబస్తు

మధిర: మహాశివరాత్రి సందర్భంగా మధిర శివాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వైరా ఏసీపీ రెహమాన్ తెలిపారు. బుధవారం జాతర జరిగే శివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సీఐ మధు, పట్టణ ఎస్సై సంధ్య, కౌన్సిలర్లు కోనా ధని కుమార్, మునుగోటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భక్తులకు మౌలిక వసతులు..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మధిర మృత్యుంజయ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని మధిర మున్సిపల్ కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు తెలిపారు. శివరాత్రి జాతరకు వచ్చే భక్తులు వైరా నదిలో పుణ్యస్నానాలు చేసేందుకు నీటి ఎద్దడి లేకుండా బుధవారం నల్లాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఇంజనీర్ నరేష్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నారీ శక్తి వందన్‌కు అపూర్వ స్పందన



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న నాయుడు రాఘవరావు

మధిరరూరల్/సత్తుపల్లిరూరల్: మధిరలోని నిధానపురం గ్రామంలో, సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నరేంద్రమోడీ నారీ శక్తి వందన్ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని ఆ పార్టీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బి.వీరంరాజు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు తెలిపారు. ప్రధాని ప్రసంగాన్ని లైవ్ ద్వారా మహిళలు చూసేందుకు గ్రామంలో ప్రత్యేకంగా స్కీన్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలిచి బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం మహిళా మోర్చా నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలతో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు కొల్లిపాక శ్రీదేవి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, పాలకొల్లు శ్రీనివాసరావు, నాగస్వామి, రాంబాబు, ప్రసాద్, సురేందర్‌రెడ్డి, కార్తీక్, సుభాని, మాధవి, పూజిత, శైలజ, రోజారాణి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, అమరవాది రాజేశ్వరి, కిసాన్ మోర్చా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మన్ కి బాత్ జిల్లా కన్వీనర్ కొప్పు రావూరి రామయోగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడికి గాయాలు

వైరా: వైరా రింగ్‌రోడ్డు సెంటర్ లారీ ఢీ కొట్టిన ఘటనలో యాచకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గడ్డం రామయ్య అను వృద్ధుడు భిక్షాటన చేస్తూ రోడ్డు దాడుతుండగా రింగ్ రోడ్డు సెంటర్‌లో లారీ ఢీ కొట్టగా.. రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఇద్దరు మహిళలకు..

కారేపల్లి: కారేపల్లి పోస్టాఫీసు రోడ్డుకు చెందిన మేకల స్వరూప, మేకల శ్రావణిలు కూలీపనుల నిమిత్తం చేనుకు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి ఇల్లందు వైపు వెళ్తున్న కారు.. కారేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు వెనుకనుంచి వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఇద్దరి మహిళలకు గాయాలు అయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.

ఐటీలో ఉద్యోగ అవకాశాలు

సత్తుపల్లిటౌన్: డిగ్రీలో కంప్యూటర్ కోర్సు చేసిన విద్యార్థులకు ఐటీలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని సీనియర్ ఆర్కిటెక్ట్ ప్రతాపనేని నవీన్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐబీఎం వాలంటీర్స్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో ఐటీ ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బీకాం కంప్యూటర్స్, బీఏ కంప్యూటర్స్ చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఈకామర్స్, వెబ్‌డెవలప్‌మెంట్ అంశాలలో నైపుణ్యం ఉన్నవారికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, అధ్యాపకులు వీరారెడ్డి, శ్రీనివాసరావు, శ్రీధర్, రామచంద్రరావు, రాంబాబు, కృష్ణారావు పాల్గొన్నారు.

పీవీఆర్ సేవలు అభినందనీయం

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డ్యూయల్ డెస్క్ బల్లలు అందజేసిన పీవీఆర్ ఫంక్షన్‌హాల్ అధినేత పారుపల్లి వెంకటేశ్వరరావు (పీవీఆర్) సేవలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ బి.జయదాసు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తరగతి గదిలో కూర్చోవడానికి బల్లలు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలువురు పీవీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఒక్కొక్క బల్ల రూ.2వేలు చొప్పున 30 డ్యూయల్ డెస్క్ బల్లలను కొనుగోలు చేసి కళాశాలకు వితరణగా అందజేశారు. అదేవిధంగా సకమోటో ఫౌండేషన్ ద్వారా మరో 30 డెస్క్ బల్లలను వితరణగా ఇప్పించేందుకు కృషి చేశారు. వాటితో పాటు విద్యార్థులకు దుస్తులు, పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది పీవీఆర్‌ని ఘనంగా సన్మానించారు.

వైద్యశిబిరం విజయవంతం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అర్బన్‌పార్కులో డివిజన్‌లోని అటవీశాఖ ఉద్యోగులకు బుధవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఎఫ్‌డీఓ వి.మంజుల ప్రారంభించారు. సింగరేణి, ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో సింగరేణి పీఓ నర్సింహారావు, రేంజర్లు స్నేహలత, అరవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, సొసైటీ ఉపాధ్యక్షుడు చెన్నారావు, కౌన్సిలర్ రాంబాబు, నర్సింహారావు, కమల్‌పాషా, వైద్యులు నర్సింహారావు, శిరీష, విజన్ టెక్నీషియన్స్ దేవిచందర్, వంశీ, సాయితేజ, జ్యోతి, స్వర్ణలత, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈనెల 10న ఫైనల్ స్క్రీనింగ్ టెస్ట్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరగోరు అభ్యర్థులకు నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ (సీఓఈ)ఫైనల్ స్క్రీనింగ్ ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మానస తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ –1 లో అర్హత సాధించిన బాలికలు తమ హాల్‌టికెట్, ఏదైనా ఒక అడ్రస్ ప్రూఫ్‌తో పరీక్ష కేంద్రానికి రావాలన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కల్లూరురూరల్: గ్రామాల్లో గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. మండలంలోని కొర్లగూడెం గ్రామానికి బుధవారం మొదటిసారిగా వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మట్టా రామకృష్ణ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొర్లగూడెం గ్రామాభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో శివకుమార్ నాయక్, నగేష్, తురాబ్‌అలీ, ప్రభాకర్ చౌదరి, సత్యంబాబు, రాధమ్మ, సక్కుబాయి పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

మధిరరూరల్: అన్ని రంగాల్లో రాణిస్తూ నారీశక్తిగా ఎదిగి, ఓర్పు, సహనానికి ప్రతీకగా నిలుస్తూ సృష్టికి మూలమైన మహిళలను గౌరవించాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ మధిర డిపోలో డిపో మేనేజర్ డి.శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి ఆధునిక జీవితంలో మహిళా శక్తి, వారి గొప్పతనాన్ని వివరించారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో డిపోలోని మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 5 సంవత్సరాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులైన సీహెచ్ మాధవి, కృష్ణవేణి, లక్ష్మినర్సమ్మ తదితరులను అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. బస్టాండ్‌లో స్వీపర్లుగా పనిచేసే మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ టీఐ రఘుబాబు, సూపరిండెంట్ వీరన్న, డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులపై సర్వే

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామంలో బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధరణి సమస్యలపై సర్వే నిర్వహించారు. డీజిటలైజేషన్ పేరుతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి రైతులకు శాపంగా మారిందని, ప్రతి రైతుకు ధరణి సమస్య ఉందని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ తెలిపారు. వాస్తవ సాగుదారులందరికీ సమగ్ర భూసర్వే నిర్వహించి ధరణిలో చేర్చి డీజిటల్ పాసు పుస్తకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణరెడ్డి, మోహన్‌రావు, రామలింగేశ్వరరావు, కృష్ణయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ వల్లూరి వసంత అన్నారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం వైద్యసేవల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని..



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.